సాక్షి
పెద్దపల్లి

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

కాల్వశ్రీరాంపూర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ ఒకటిన చేపట్టిన 'చలో హైదరాబాద్ – మహాధర్నా' పోస్టర్‌ను పీఆర్టీయూ నేతలు ఆవిష్కరించారు.



సర్వాయి పాపన్నకు నివాళి

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ వేణు పూలమాల వేసి నివాళి అర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యూరియా కోసం బారులు



సింగిల్‌విండో ఎదుట క్యూలో రైతులు

ఎలిగేడు(పెద్దపల్లి): స్థానిక సహకార సంఘ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం ఉదయమే బారులు తీరారు. యూరియా లోడ్ వచ్చిందనే సమాచారంతో ఒక్కసారిగా అన్నదాతలు తరలివచ్చారు. మొత్తం 1,320 బస్తాల యూరియా రాగా.. ఒక్కో ఎకరాకి ఒకబస్తా చొప్పున రైతులకు పంపిణీ చేసినట్లు ఏవో ఉమాపతి తెలిపారు. యూరియా కోసం రైతులు ఆపోహ పడొద్దని, అవసరాలకు అనుగుణంగా అందిస్తామని ఏవో వివరించారు.


విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న పూజారులు

ధర్మారం(పెద్దపల్లి): ఖిలావనపర్తిలో సోమవారం శ్రీమడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాయకులు ముత్యాల వీరస్వామి, గుడికందుల సురేశ్, లావుడ్య రూప్లా నాయక్, పోల్‌దాసరి సంతోష్, తిరుపతిరెడ్డి, గందం మల్లయ్య, కొత్త నర్సింహులు, సోగాల తిరుపతి, జగన్‌మోహన్‌రెడ్డి, ఓరం చిరంజీవి, నూనే మల్లేశం, సాగంటి కొండయ్య, సోగాల మీనా, మోతె రవి, సంతోష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు



నీళ్లు ఎత్తిపోస్తున్న పంప్‌లు

ధర్మారం(ధర్మపురి): నందిమేడారంలోని నందిపంప్‌హౌస్ ద్వారా ఎల్లంపల్లి నీటిని ఆరు రోజులుగా ఎత్తిపోస్తున్నారు. తొలిరోజు మూడు విద్యుత్ మోటార్లను ఆన్ చేసిన అధికారులు.. క్రమంగా నాలుగింటిని ప్రారంభించి మేడారం నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయిస్తున్నారు. సోమవారం రెండు పంప్‌లతోనే నడిపించారు. ఒక్కోదాని నుంచి 3,150 క్యూసెక్కులను తరలిస్తున్నారు. ఇదే నీటిని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు ఎత్తిపోతలు కొనసాగుతాయని ఏఈ నర్సింగరావు తెలిపారు.

ఘనంగా వరదపాశం వేడుక



వరదపాశం ఉత్సవంలో భక్తులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వెన్నంపల్లి–జాఫర్‌ఖాన్‌పేట గుట్టల్లోని పాండవలొంక జలపాతం వద్ద సోమవారం వరదపాశం లక్ష్మీదేవర బోనాలు వైభవంగా జరిగాయి. బోనాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడిపంటలు, ఆయురారోగ్యాలతో చల్లంగా చూడాలని మహిళా భక్తులు వరదపాయసం పోశారు.

టెక్నాలజీని వినియోగించాలి



మాట్లాడుతున్న డీసీపీ కరుణాకర్

రామగిరి(మంథని): మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అల్ట్రాటెక్ ప్లాంట్ అధిపతి మందల శ్రీనివాస్‌రెడ్డి, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సూచించారు. పన్నూర్ జేఎన్టీయూలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్ హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకుంటేనే భవిష్యత్‌లో రాణిస్తారని అన్నారు. ఏసీపీ రమేశ్, సీఐ రాజుగౌడ్, ఎస్సై శ్రీనివాస్, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి రెయిన్‌కోట్స్ అందజేత



సిబ్బందితో కమిషనర్ అరుణశ్రీ తదితరులు

కోల్‌సిటీ(రామగుండం): పారిశుధ్య సిబ్బందికి బల్దియా కమిషనర్ అరుణశ్రీ రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. వ్యక్తిగత రక్షణ కిట్లతోపాటు రెయిన్ కోట్లనూ ధరించాలని సూచించారు.

ముసురేసింది

- జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు
- ఊపందుకున్న సాగు పనులు
- ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు
- 32 గేట్ల ఎత్తి దిగువకు నీటి విడుదల



ఎల్లంపల్లి ప్రాజెక్టులోని 32 గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న గోదావరి నదిలోకి ఉరకలేస్తున్న వరద

సాక్షి పెద్దపల్లి: జిల్లావ్యాప్తంగా మూడురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానపడుతోంది. వాగులు, చెక్‌డ్యాంలు వరదతో పరవళ్లు తొక్కుతున్నాయి. చెరువులకు భారీగా వరదనీళ్లు వచ్చిచేరుతున్నాయి. గోదావరి నదితోపాటు మానేరులో నీటి ప్రవాహం పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద భారీగా వస్తోంది. చెరువులు, వాగుల్లోనీరు చేరుతుండటంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. మరికొద్ది రోజులు భారీవానలు కురిస్తే అన్ని చెరువులు మత్తడిదూకే అవకాశం ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు మొదలు.. ఉద్యోగుల వరకూ.. ఇబ్బంది పడుతున్నారు. గొడుగులు పట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. జోరువానల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం సూచిస్తోంది.

ఇంకా 16శాతం లోటు..

జిల్లాలోని 7 మండలాలు మినహా మిగతా ప్రాంతాల్లో సాధారణానికి మించి వానాలు కురిశాయి. ధర్మారం, రామగుండం, రామగిరి, పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, మంథని మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే నమోదయ్యింది. ఈసీజన్‌లో ఇప్పటి వరకు 582.5 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ, 16శాతం లోటుతో 491.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 1,018 చెరువులుండగా 210 చెరువులు మత్తడి దూకుతున్నాయి. మరో 512 చెరువులు మత్తడి పోసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

నిండుకుండలా 'గుండారం'

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించే గుండారం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వలతో నిండుకుండలా మారింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు, ఎస్సారెస్పీ నీటి విడుదల, గౌరీగుండం జలపాతం వరదనీటితో రిజర్వాయర్ జలకల సంతరించుకుంది. రిజర్వాయర్ నీటిమట్టం 12 అడుగులకు చేరిందని అధికారులు తెలిపారు.

చెరువులకు జలకళ

మంథనిరూరల్: గుంజపడుగు, నాగారం, విలోచవరం, కన్నాల, పుట్టపాక, ఉప్పట్ల గ్రామాల్లోని చెరువులు మత్తడి దూకుతున్నాయి. మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెలబోయిన చెరువులు వరదనీటితో కళకళలాడుతున్నాయి.

జిల్లాలో సోమవారం నమోదైన వర్షపాతం(మి.మీ.లలో)			
ధర్మారం	15.1	రామగిరి	28.2
పాలకుర్తి	24.6	కమాన్‌పూర్	28.0
అంతర్గాం	19.3	మంథని	17.2
రామగుండం	17.1		

మానేరు ఉధృతం

ఓదెల(పెద్దపల్లి): కనగర్తి, మడక, గుంపుల, పేట, కనగర్తి, ఇందుర్తి తదితర తీర ప్రాంతాల్లోని మానేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల ఇసుక తిన్నెలతో కనిపించిన ఏరు.. అకస్మాత్తుగా నీటితో జలకళ సంతరించుకోవడంతో స్థానికులతోపాటు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. మానేరు అవతలి వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ఎక్కడికి అక్కడే ఆగిపోయారు. పొత్కపల్లి ఎస్సై రమేశ్ గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు.

'ఎల్లంపల్లి' గేట్లు మళ్లీ ఎత్తివేత

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను సోమవారం మరోసారి ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో ఆదివారం రాత్రి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద భారీస్థాయిలో వచ్చిచేరుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ ఉధృతికి అనుగుణంగా గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.70 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులోకి 78 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, హైదరాబాద్‌కు 295 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంపుహౌస్‌కు 3,150 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు 32 గేట్లు ఎత్తి 1,65,632 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. దీంతో గోదావరి నదికి వరద పోటెత్తింది.

మత్తడిదూకుతున్న చెరువులు



జూలపల్లి(పెద్దపల్లి): వడ్కాపూర్ శివచెరువు, పెద్దాపూర్ పెద్దచెరువు, తెలుకుంట రామప్పచెరువు నీటితో కళకళలాడుతున్నాయి. భారీవర్షాలకు తోడు ఎస్సారెస్పీ డీ– 83, డీ– 86 మైనర్ కాలువల ద్వారా నీరు విడుదల చేయడంతో పొలాల్లోంచి చెరువుల్లోకి చేరుతోంది.

వరిపంటకు ఢోకాలేదు



వర్షాలకుతోడు ఎస్సారెస్పీ కాలువనీరు వచ్చి చేరుతోంది. చెరువులు దాదాపు నిండే స్థాయికి చేరాయి. వరినాట్లు పూర్తి చేస్తున్నాం. ఇక వరి పంటకు సరిపడా నీరు వచ్చి చేరుతోంది.

– మంద లక్ష్మణ్, రైతు, తెలుకుంట



గుంపుల గ్రామ సమీపంలో మానేరు ఉధృతి



నిండుకుండలా మారిన గుండారం రిజర్వాయర్



నిండిన గుంజపడుగు పెద్దచెరువు

రైతులూ.. ఆందోళన వద్దు

- జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు
- మీడియా సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సాక్షి, పెద్దపల్లి: 'జిల్లా అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయి.. గతేడాదికన్నా 6,000 మెట్రిక్ టన్నులు అధికంగానే పంపిణీ చేశాం.. రైతులు ఆందోళన చెందొద్దు' అని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. యూరియా లభ్యత, టామ్‌కామ్, ఏటీసీ, ఐటీఐ సీట్లు, టాస్క్ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ తదితర అంశాలపై సోమవారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. వానాకాలం పంటలకు 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 19 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం 2,500 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. త్వరలో మరో 300 మెట్రిక్ టన్నులు, ఈనెల 24న మరో వంద మెట్రిక్ టన్నులు ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి వస్తుందని తెలిపారు. రైతులు అవసరం మేరకే కొనుగోలు చేయాలని కోరారు. పదిరోజుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 1,500 మెట్రిక్ టన్నులు ప్రత్యేకంగా తెప్పించామన్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోంచి మహారాష్ట్రకు కొంత అక్రమంగా తరలివెళ్తోందని, ముందుజాగ్రత్తగా మన జిల్లాలో కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు.

వెంటనే బిల్లులు మంజూరు

జిల్లాకు 6,400పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు 3,926 మంది ముగ్గుపోశారని, 1,466 వరకు బేస్మెంట్ స్థాయిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఆధార్ ఆధారంగా ప్రతీ సోమవారం లబ్ధిదారు బ్యాంకు ఖాతాల్లో బిల్లు డబ్బులు జమ అవుతున్నాయన్నారు. ఇలా ఇప్పటివరకు రూ.19.52 కోట్లు జమచేశామన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించేందుకు స్వశక్తి మహిళా సంఘాల నుంచి రూ.4.9కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, సభ్యత్వం లేని 10 కుటుంబాలకు కలెక్టరేట్ నుంచి రూ.లక్ష చొప్పున రుణం మంజూరు చేశామని వివరించారు. కొత్తగా 12,165 కుటుంబాలకు రేషన్‌కార్డులు జారీచేశామని, మరో 30 వేల మంది సభ్యులను రేషన్ పరిధిలోకి చేర్చామని అన్నారు. మీసేవ, ప్రజాపాలన దరఖాస్తులనూ పరిశీలిస్తున్నామని, దీనిని నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం

అగ్నివీర్ ద్వారా సైన్యంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 200 మంది ఆసక్తిగల అభ్యర్థులకు సింగరేణి, ఎన్టీపీసీ సహకారంతో ఉచి తంగా శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఇందుకోసం ఈనెల 26న కలెక్టరేట్‌లో అవగాహన కల్పిస్తామని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీ, ఇంజినీరింగ్ పాసైన యువత ముందుకు వచ్చి టాస్క్ కోర్సుల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఐటీఐ, ఏటీసీల్లో ఆధునిక యంత్రాలను అందుబాటులో ఉంచామని, సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయని వివరించారు. భారీవర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ తెలిపారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి
- ప్రజావాణిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి ద్వారా అందిస్తున్న అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ వేణుతో కలిసి కలెక్టరేట్‌లో ప్రజావాణి ద్వారా కలెక్టర్ వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమస్యలపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ సూచించారు.

ఆత్మహత్యాయత్నంతో కలకలం..

ప్రజావాణి ద్వారా తన సమస్యను కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులకు విన్నవించేందుకు కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట నుంచి వచ్చిన బండి సతీశ్ ఒక్కసారిగా క్రిమిసంహారకమందు తాగి ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది సతీశ్‌ను బయటకు తీసుకెళ్లి అంబులెన్సులో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సతీశ్ ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు.

ప్లాట్లను నియంత్రించండి

పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో నిబంధనలను ఉల్లంఘించి, లేఔట్ అనుమతులు లేకున్నా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. – బొబ్బిలి సత్యనారాయణ, సామాజిక కార్యకర్త

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

వర్షాలకు ఇల్లు కూలిపోయింది. నిరుపేదరాలిని. నాకు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి. అన్నిఅర్హత లున్న నాకు ఇల్లు మంజూరుచేసి న్యాయం చేయాలి.

– స్వరూప, జీలకుంట, ఓదెల మండలం

విచారణ జరిపించండి



సుల్తానాబాద్ మండలం కనుకుల గౌడసంఘం కోసం 40 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేశాం. మా అధీనంలోనే ఉన్న భూమి నాదేనంటూ అభ్యంతరం చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలి. – కనుకుల గౌడసంఘ సభ్యులు

పట్టా ఇప్పించాలి



వారసత్వంగా వచ్చిన భూమికి సంబంధించిన పేరు మార్పిడి చేసి పట్టా ఇప్పించాలి. ప్రస్తుతం ఈ భూములు మరణించిన మా తాత పేరిట ఉన్నయ్. విచారణ జరిపి న్యాయం చేయాలి.

– మంద భాస్కర్, నారాయణపూర్

సింగరేణిలో పట్టుకోసం కసరత్తు

గోదావరిఖని: సింగరేణిలో పట్టుకోసం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించిన సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 40 వేల మంది గని కార్మికులు పనిచేస్తున్నారు. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికల్లో వీరి ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. అందుకే ఇక్కడ పాగా వేస్తే అత్యధిక స్థానా లు కైవసం చేసుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు.

నెలక్రితం రాజధానిలో భేటీ..

నెలక్రితం టీబీజీకేఎస్ ముఖ్య నాయకులతో రాజధానిలో కేటీఆర్ సుదీర్ఘంగా సమావేశమయ్యారు. యూనియన్ ఇన్‌చార్జిగా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. సింగరేణిలో గుర్తింపు యూనియన్‌గా టీబీజీకేఎస్ రెండుసార్లు గెలుపొందింది. అయితే, కారణాలు ఏవోకానీ.. బీఆర్‌ఎస్ ఆదేశాల మేరకు గత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు దూరంగా ఉండిపోయింది. దీంతో చాలా ప్రాంతాల్లో యూనియన్ నేతలు వలసబాట పట్టారు. మిగిలినవారు సందిగ్ధంలో పడిపోయారు. ఈక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి నాయకులతో సింగరేణిలోని అన్ని ఏరియాల్లో కమిటీలు వేశారు. ఇటీవల హెచ్‌ఎంఎస్‌తో కలిసి సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించారు. ఆమె దూకుడుకు అడ్డుకట్ట వేయాలనే వ్యూహంతో కేటీఆర్ సైతం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

హైదరాబాద్‌లో కేంద్ర కమిటీ సమావేశం

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)లోని కీలక నాయకులతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 20న హైదరాబాద్‌లో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కవితకు ఉద్వాసన?

కల్వకుంట్ల కవిత జాగృతి పేరిట సింగరేణిలో ప్రత్యేక కమిటీలు వేయడం, ఇటీవల హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌తో సమావేశమై సమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలని నిర్ణయం తీసుకోవడంతో కేటీఆర్ సైతం వ్యూహాత్మకంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అనుమతి తీసుకోవాలి

గోదావరిఖని: వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని రామగుండం పోలీస్‌కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. ఈనెల 27న వినాయక చవితి ఉందని, మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలోని మండపాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు జరుపుకోవాలనుకునేవారు పూర్తిసమాచారంతో https:// policeportal.tspolice.gov.in/index.htmవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. అత్యవసర సేవల కోసం కమిషనరేట్ సిబ్బంది 24గంటలపాటు అందుబాటులో ఉంటుందని, డయల్ 100 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉద్యోగావకాశాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టుల భర్తీకి ఈనెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మాధవి తెలిపారు. అంతర్గాం, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, పెద్దపల్లి, రామగిరి, రామగుండం, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ కేంద్రాల్లో సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 95027 46161 నంబరులో సంప్రదించాలని డీఈవో సూచించారు.

సమన్వయ లోపమే కారణమా?

- నిర్ణయం కోసం రోజుల తరబడి జాప్యం
- సాంకేతిక నిపుణుల రాకలో ఆలస్యం
- యూరియా ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

గోదావరిఖని: వరుస లాభాలు సాధిస్తున్న రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్‌ఎఫ్‌సీఎల్) కొంతకాలంగా యూరియా ఉత్పత్తిలో వెనుకబడుతోంది. తరచూ మరమ్మతులతో షట్‌డౌన్ కావడంతో అమోనియా, యూరియా ఉత్పత్తి నిలిచిపోతోంది.

యూరియా కొరతను అధిగమించేందుకే..

రాష్ట్ర అవసరాలు తీర్చుతూ, కొరతను అధిగమించడం ధ్యేయంగా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)ను 17 ఫిబ్రవరి 2015న ఎఫ్‌సీఐ పాతప్లాంట్ స్థానంలో స్థాపించారు. ప్రతీరోజు 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా, 3,850 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంగా డిజైన్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో తరచూ మరమ్మతు చోటుచేసుకుని ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. ప్రధానంగా అమ్మోనియా పైపులైన్‌ల లీకేజీలతో ఉత్పత్తికి విఘాతం కలుగుతోంది. ఇలాంటి సమస్యలు గతంలో ఎదురైనా.. ఈసారి మరమ్మతులకు అధిక సమయం తీసుకుంటోంది.



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ముఖద్వారం

దూరంలో కార్పొరేట్ కార్యాలయం

ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఢిల్లీలో నోయిడాలో ఉంది. దీంతో ప్లాంట్‌లో ఏదైనా సమస్య తలెత్తితే ఢిల్లీలోని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా మరమ్మతులు నిర్వహించే ఇంజినీర్లు అందుబాటులో ఉండడంలేదు. దీంతో సమస్య జటిలంగా మారుతోంది. గ్యాస్ ఆధారితంగా నడిచే ప్లాంట్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఏర్పడినా ఇతర ప్రాంతాల నుంచి నిపుణులను రప్పించడం కష్టంగా మారుతోంది.

ఉద్దేశపూర్వకంగా షట్‌డౌన్?

ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా ప్లాంట్‌ను షట్‌డౌన్ చేస్తోందా? లేక తరచూ మరమ్మతులకు గురవుతోందా? అనే విషయంపై స్పష్టతకోసం రాజకీయ నేతలు పట్టుబడుతున్నారు. వార్షిక మరమ్మతులు పూర్తిచేసుకున్న తర్వాత కొద్దిరోజుల పాటు సజావుగానే ఉత్పత్తి సాగుతున్నా.. ఆ తర్వాతే షట్‌డౌన్ కావడంతో రైతులకు సకాలంతో యూరియా అందించలేకపోతున్నారు.

ఐదు నెలల్లో మూడుసార్లు లీకేజీ..

గత ఐదునెలల్లో ప్లాంట్‌లో మూడుసార్లు యూరియా, అమ్మోనియం ఉత్పత్తికి విఘాతం కలిగింది. గత మే 8 నుంచి జూన్ 15 వరకు ఉత్పత్తి నిలిచిపోయింది. జూలై 16 నుంచి ఆగస్టు 4 వరకు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఆగస్టు 14 నుంచి అమ్మోనియం లీకేజీతో ప్లాంట్‌ట్ షట్‌డౌన్‌లో ఉంది. అమ్మోనియా పైపులైన్ లీకేజీలతె ఉత్పత్తి నిలిపివేయాల్సి వస్తోంది. వార్షిక మరమ్మతుల సమయంలోనూ సమయం అధికంగా తీసుకుంటోంది. అయినా, శాశ్వత ప్రాతిపదికన పనులు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

20వేల టన్నులే సరఫరా

ఈఏడాది ఇప్పటి వరకు 65వేల టన్నులకు గాను 20వేల టన్నులను మాత్రమే రాష్ట్రానికి అందించింది. వరి సాగు మొదలైన క్రమంలో యూరియా ఉత్పత్తికి విఘాతం కలుగడం రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సైతం సీరియస్‌గా ఉంది. ఈక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మూడు రోజుల క్రితం ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ సందర్శించి ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు.

మూడేళ్లలో సాధించిన వార్షిక లాభాలు(రూ.కోట్లలో)		
ఏడాది	వార్షికాదాయం	నికర లాభం
2022–23	4,586	8.59
2023–24	4,941	328.13
2024–25	5,291	413.30

సీబీఐతో విచారణ జరపాలి

ప్లాంట్ నిర్వహణపై ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తీరు అనుమానాస్పదంగా ఉంది. ఉత్పత్తి గురించి పట్టించుకోవడమే లేదు. ప్రమాదకరమైన అమ్మోనియా లీకేజీతో కార్మికులకు ప్రమాదం పొంచిఉంది. షట్‌డౌన్ అయిన ప్రతీసారి కార్పొరేట్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు వచ్చి నిర్ణయం తీసుకోవడంతో జాప్యమవుతోంది. రైతులకు సకాలంలో యూరియా అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఎఫ్‌సీఎల్ లక్ష్యం అందుకోలేకపోతోంది. వీటన్నింటిపైనా సీబీఐ విచారణ జరిపించాలి.

– రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

క్లుప్తంగా

ఇంట్లో జారిపడి వ్యక్తి మృతి



మహ్మద్ అతిక్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గంజ్‌రోడ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అతిక్ (38) తన ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందాడు. అతిక్ ఆదివారం సాయంత్రం తన ఇంట్లో కాలుజారి పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విషజ్వరంతో పారిశుధ్య కార్మికుడు..



స్వామి (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తు న్న జుట్టు స్వామి విషజ్వ రంతో సోమవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్వామి వారం రోజులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అయినా జ్వరం తగ్గలేదని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బండెల రాజశేఖర్ (35) అనే వ్యక్తి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్దుర్తి గ్రామానికి చెందిన బండెల రాజశేఖర్ భార్య మూడు నెలల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి రాజశేఖర్ ఒంటరితనంతో బాధపడుతూ తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి బండెల గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ ,పెద్దమ్మ తల్లి ఆలయాల్లో రెండున్నర తులాల బంగారం, 59తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. గ్రామస్తుడు పూదరి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ట్యాక్సీడ్రైవర్‌కు రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ.. వాహనాన్ని అజాగ్రత్తగా.. నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన ట్యాక్సీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్నపద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన 12 మంది మహిళలు రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో జరిగిన ఓ శుభకార్యానికి ఓ మినీటాక్సీలో వెళ్లారు. మోరపల్లి శివారులో డ్రైవర్ పరాంకుశంవంశీకృష్ణ సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న తోట్ల గంగవ్వ అక్కడికక్కడే చనిపోయింది. మిగతావారు గాయపడ్డారు. దీనిపై బాధితురాలు రాధ ఫిర్యాదు మేరకు అప్పటి జగిత్యాల రూరల్ ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేశారు. సీఐ కృష్ణకుమార్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం .కిరణ్‌కుమార్, కె. నరేశ్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో వంశీకృష్ణకు రెండేళ్ల జైలు, జరిమానా విధించారు.

బహిరంగ ప్రదేశంలో కోడె టికెట్లు ?

- ఉద్యోగుల తీరుపై అనుమానాలు


వేములవాడ: రాజన్న ఆలయంలో ప్రధాన మొక్కు అయిన కోడె టికెట్లు ఆలయం బయట ప్రదేశంలోకి రావడం కలకలం రేపాయి. కోడెమొక్కు చెల్లించే భక్తులు రూ.200 పెట్టి టికెట్ కొని కోడెతో ప్రదక్షిణ చేసి ప్రధాన ద్వారానికి ఎదురుగా కట్టేస్తారు. ఈక్రమంలో కోడె టికెట్లు పరిశీలించేందుకు రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది కోడె టికెట్లు తీసుకుని చించివేస్తారు. అయితే ఆ చించివేసిన టికెట్లు సోమవారం ఆలయంలోని స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌పై దర్శనమిచ్చాయి. ఇక్కడి ఎలా వచ్చాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ ఉద్యోగులే రీసైక్లింగ్ చేస్తూ డబ్బులు దండుకునేందుకు ఇలా తెచ్చి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఈవో రాధాభాయి మాట్లాడుతూ గతంలో ఈ టికెట్లను ఓపెన్‌స్లాబ్‌పై వేసి ఉంటారని, ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.





చిత్రం..

జ్ఞాపకాల పత్రం



- చరితకు చెరిగిపోని సాక్ష్యం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

విద్యానగర్(కరీంనగర్)/సిరిసిల్ల: ఫొటో.. చెదిరిపోని జ్ఞాపకం. గతించిన కాలాన్ని కళ్ల ముందుంచే సాక్ష్యం. మదిలే మెదిలే భావాలను కళ్ల ముందు నిలిపే ఛాయాచిత్రం. ఫొటోగ్రఫీకి సృజనాత్మకత తోడైతే అద్భుత చిత్రాలు కళ్లముందుంటాయి. మదిని పులకింపజేసి.. మనసును తట్టిలేపి.. మధురమైన అనుభూతులను పదిలం చేసేది ఫొటో. ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు.. జిల్లా వాసుల ప్రతిభపై ప్రత్యేక కథనం.

కరీంనగర్‌లో తొలి ఫొటో స్టూడియోలు

1961 ప్రాంతంలో కరీంనగర్‌లో ఫొటో స్టూడియోలు ఏర్పాటయ్యాయి. కరీంనగర్‌లోని క్లాక్‌టవర్ వద్ద ఏవీఎం ఫొటో స్టూడియో, తిలక్‌రోడ్‌లో అజంతా ఫొటో స్టూడియోను ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన ఏలేటి వేణుమాధర్‌రెడ్డి 1961 జనవరి 1న ఆయన పేరుతో ఏవీఎం స్టూడియో ప్రారంభించారు. మూడేళ్ల తర్వాత గురుదత్త నిర్మాత సారథ్యంలో ముంబైలో రూపొందిన మొదటి స్కోప్ సినిమాకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశారు. బ్లాక్ అండ్ వైట్ మాన్యువల్ నుంచి 35 ఎంఎం మినియేచర్ ఫిలిం, కలర్ ప్రాసెసింగ్ కంప్యూటర్ వరకు కొనసాగారు. ఆయన వాడిన 1945 నాటి రోలిఫ్లెక్స్, ఎగ్జాక్ట, మన్య, కేబినేట్, ఫుల్‌సైజ్‌ల నెగెటివ్‌ల బాడీ కెమెరాలు ఇప్పటికి వాళ్ల ఇంట్లో భద్రంగా ఉన్నాయి. ఆయన నలుగురు కొడుకులు ఈ రంగంలోనే రాణిస్తున్నారు.

➡ ఫొటోగ్రఫీ డే గురించి

ఫ్రెంచ్ దేశస్తుడైన డాగురే 1839లో మొదటిసారి ఫొటోగ్రాఫిక్ ప్రాసెస్ కనిపెట్టి అదే సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచానికి పరిచయం చేశాడు. సిల్వర్ అయొడైడ్ రసాయనంతో చిత్రానికి శాశ్వతత్వం కల్పించవచ్చని ప్రతిపాదించాడు. 1842 నుంచి 1880 మధ్య కాలంలో ఇండియలో ఫొటోగ్రఫీ పరిశ్రమ విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి పోర్ట్‌రయిట్ స్టూడియోను డీన్ దయాళ్ కెన్నడీ అనే మహిళ స్థాపించింది. 1960 నాటికి స్టూడియో ఫొటోగ్రఫీ, 1980 నాటికి కంప్యూటర్‌తో కలర్ ఫొటోగ్రఫీ విస్తరించింది. రాజా త్రయంబక్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొదటి సారి 1957లో ఫొటోగ్రఫీ సొసైటీ ప్రారంభమైంది.

➡ ఉమ్మడి జిల్లా ప్రస్థానం

1940లో ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్‌లో మొదటి ఫొటోస్టూడియో నెలకొల్పారు. ప్రతిష్టాత్మక ఫెలోషిప్ ఆఫ్ రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ (ఇంగ్లాండ్) సాధించిన ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకైక వ్యక్తి కోరుట్లకు చెందిన ఫొటోగ్రాఫర్ బండి రాజన్‌బాబు. 1987లో నగ్న చిత్రాలపై థీసిస్ సమర్పించి రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. జగిత్యాలకు చెందిన అల్లె శ్రీకాంత్, కోరుట్లకు చెందిన బండి వెంకటరమణ, కరీంనగర్‌కు చెందిన బాబురెడ్డి, వేణు, రాజు, సంపత్‌కుమార్, వాసు, గంగాధర్, సదానందం, ఆత్మారాం, వేములవాడకు చెందిన రాజయ్య, జగిత్యాలకు చెందిన రామ్మోహన్, సతీష్, సిరిసిల్లలో ఎం.సి. శేఖర్, టోడ రవీందర్, కోడం దేవేందర్, వంకాయల శ్రీకాంత్, కోరుట్లకు చెందిన నాగరాజు, రాజేశం, శేఖర్, మహేందర్, మారుతి, మెట్‌పల్లి రాము, మల్యాల శ్రీనులు, ఎల్లారెడ్డిపేటకు చెందిన ప్రభాకర్‌రెడ్డి, సిరిసిల్లకు చెందిన శంకర్ మరెందరో ఫొటోగ్రఫీలో సృజనాత్మకతను జోడించి రాష్ట్ర స్థాయి అవార్డులు పొందారు.

➡ ప్రీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ

ఏ ఫంక్షన్ జరిగిన, ఎక్కడికి వెళ్లిన సెల్‌ఫోన్లతోనే ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీపై కొత్తగా జంటలు ఉత్సాహం చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా తమకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని ప్రీ వెడ్డింగ్ ఫొటోలతోపాటు పెళ్లి వేడుకలను ఫొటోగ్రాఫర్లతో తీయించుకుంటున్నారు.

రీళ్ల నుంచి డిజిటల్



నాడు రీళ్లతో ఫొటోలు తీసేవాళ్లం, సాంకేతిక ప్రగతిలో నేడు డిజిటల్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్ కెమెరాలు, ఇంటింటికీ కెమెరాలు వచ్చినప్పటికీ ఫొటో స్టూడియోలకు ఆదరణ తగ్గలేదు. రీళ్ల పద్ధతి పోయి, డిజిటల్ కెమెరాలు, ప్రింటింగ్ యంత్రాలు ప్రవేశించడంతో ఈ ప్రక్రియ పూర్తిగా సులభతరమైంది. – ఆవుల నరేశ్, ఫొటోగ్రాఫర్, జ్యోతినగర్, కరీంనగర్

ఎన్నో మార్పులు



మా చిన్నప్పుడు ఫొటో అంటే ఓ క్రేజ్. ఏదైనా ఫంక్షన్ జరిగితే ఫొటోగ్రాఫర్ వచ్చి ఫొటోలు తీయడం, స్టూడియోకి వెళ్లి ఫొటోలు దిగడం చాలా కొత్తగా అనిపించేది. ఇప్పుడు సెల్‌ఫోన్‌లో అన్ని ఫంక్షన్‌లు, అన్ని సందర్భాల్లో ఫొటోలు తీసుకోవడం, మెమొరీ కార్డుల్లో భద్రపరచుకుంటున్నాం. – పల్లెర్ల శ్రీనివాస్, అశోక్‌నగర్, కరీంనగర్

అంతర్జాతీయ గుర్తింపు



సిరిసిల్లకు చెందిన ఫొటోగ్రాఫర్ మేర్గు చంద్రశేఖర్(ఎంసీ శేఖర్)కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దక్షిణాఫ్రికా పర్యాటక గిరిజనశాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిలా ఆర్ట్ ఆఫ్ ఫొటోగ్రఫీలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచస్థాయి పోటీల్లో శేఖర్ తీసిన 'హార్డ్‌స్మైల్' బంగారు పతకం సాధించింది. అంతకుముందే శేఖర్ దశాబ్దకాలంగా గిరిజన జీవనశైలిపై, సామాజిక అంశాలపై ఫొటోలు తీసి పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ స్థాపించారు. ఔత్సాహికులైన ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల సాలార్‌జంగ్ మ్యూజియంలో రాష్ట్రస్థాయి ఫొటో వర్క్‌షాప్ నిర్వహించారు. ఎం.సీ.శేఖర్ తీసిన ఫొటోలకు 98 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి.

ఫొటోగ్రఫీలో రాణిస్తున్న పోలీస్



దాసరి మల్లేశ్ తీసిన ఫొటో



దాసరి మల్లేశ్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన దాసరి మల్లేశ్ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకున్న మల్లేశ్ ఫొటోగ్రఫీలోని మెలకువలను నేర్చుకొని.. తీరక సమయంలో తన కళాభిరుచిని తీర్చుకుంటున్నారు. ఫొటో వర్క్‌షాప్‌లలో పాల్గొని అద్భుత ఫొటోలు తీసి బహుమతులు అందుకున్నారు. పల్లె ప్రజల జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలపై తీసిన ఫొటోలకు ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా మూడో బహుమతి అందుకున్నారు.

రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- వేగంగా దూసుకొచ్చి బస్సును ఢీకొట్టిన కారు
- నుజ్జునుజ్జయిన వాహనం.. వేలాడిన మృతదేహం



ఎలక్ట్రికల్ బస్సును ఢీకొన్న కారు



సంఘటనా స్థలంలో మృత్యుంజయ్ మృతదేహం

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ స్టేజీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం.. కరీంనగర్ నుంచి కొంగారి మృత్యుంజయ్ (32) భార్య, కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్నారు. ముందున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో రోడ్డుపై కారు అదుపుతప్పింది. డివైడర్ అవతలివైపు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు సగం బస్సు కిందికి చొచ్చుకుపోయింది. డ్రైవర్ పక్కసీట్లో కూర్చున్న మృత్యుంజయ్ అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు మత్యుంజయ్ హైదరాబాద్‌కు చెందిన వాడు. ఈయన ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నట్లు సమాచారం.

ఇసుక వివాదం..

మెట్‌పల్లి రూరల్: ఇసుక విషయమై జరిగిన వివాదంపై మెట్‌పల్లి పోలీసులు నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఈనెల 10న అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెల్సిందే. ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా రెండు రోజులైనా అదుపులోకి రాలేదు. యార్డులో గన్నీసంచులు కాలుతుండగా వాటిపై ఇసుక పోసి మంటలు ఆర్పాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఈనెల 12న ట్రాక్టర్లలో ఇసుక తరలించారు. ఆ సమయంలో పలువురు ట్రాక్టర్లను అడ్డుకుని వివాదం చేశారు. అక్కడే ఉన్న తనను కులం పేరుతో దూషిస్తూ దుర్భషలాడారని వీడీసీ చైర్మన్ రమేశ్ మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన తాటిపెల్లి సురేశ్‌రెడ్డి, తిప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కేశిరెడ్డి నవీన్‌రెడ్డి, శోభపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు సోమవారం ఆత్మకూర్‌కు వెళ్లి విచారణ జరిపారు. ఆయన వెంట మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

నిండుకుండలా ఎగువమా'నీరు'



ఎగువమానేరు ప్రాజెక్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాలైన కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగు, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగుల ద్వారా వరద నీరు జలాశయంలోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం రెండు టీఎంసీలు(31అడుగులు) కాగా.. ప్రస్తుతం 1.61టీఎంసీలు (29అడుగులు) నీటి మట్టం ఉంది. దాదాపు 1,080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇదే వరద కొనసాగితే ఒకటి, రెండు రోజుల్లో ప్రాజెక్టు పరవళ్లు తొక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పరీవాహక వాగు ప్రాంత రైతులు, పశువుల, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మారుతిరెడ్డి సూచించారు. వాగుల వద్దకు చేపల వేటకు ఎవరు వెళ్లవద్దని హెచ్చరించారు.

రాజన్నకు శ్రావణ మొక్కులు







వేములవాడ: రాజన్నను సోమవారం 60 వే ల మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. ట్రాఫిక్ పెరిగిపోవడంతో టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెరుకు రైతుకు రవాణా భారం

- ఫ్యాక్టరీ ప్రారంభం కాక అదనపు ఖర్చులు
- టన్నుకు రూ.700 వరకు భారం
- ఆదుకోవాలని రాష్ట్ర మంత్రులకు విన్నపాలు



చెరుకు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఏకైక ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని రైతులు ఏళ్ల తరబడి కోరుతున్నా.. పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా.. చక్కెర ఫ్యాక్టరీ మాత్రం ప్రారంభం కావడం లేదన్నది ఇక్కడి రైతుల వేదన. దీంతో చెరుకు పంటపై మమకారం చంపుకోలేక.. రైతులు ఇతర జిల్లాలో ఉన్న ప్రైవేట్ చెరుకు ఫ్యాక్టరీతో ఒప్పందాలు చేసుకొని చెరుకును సాగు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీ సైతం చెరుకు రైతులకు అవసరమైన సదుపాయాలను కల్పించలేక నిర్లక్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని, అప్పటివరకు చెరుకు రైతులపై పడే రవాణా భారాన్ని ప్రభుత్వం భరించాలని చెరుకు రైతులు ఇటీవల జగిత్యాలకు వచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మన్‌కుమార్, వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందించారు.

1,500 ఎకరాల్లో సాగు

జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉండడంతో.. ప్రస్తుతం చెరుకు పంటను దాదాపు 1,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఒకప్పుడు 10వేల ఎకరాలకుపైగా చెరుకు పంట ఉన్నా.. ఫ్యాక్టరీ మూసేయడంతో విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో జిల్లాలో ఉన్న చెరుకు ఫ్యాక్టరీ ప్రభుత్వానిది కావడంతో.. పంట సాగు చేసే రైతులకు ఎరువులు, విత్తనం, కటింగ్, రవాణా వంటి వాటిపై ప్రోత్సాహకాలు అందించేది. ఇప్పుడు జిల్లాలో చెరుకు సాగు చేసే రైతులు కామారెడ్డి జిల్లాలో ఉన్న ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును పంపిస్తుండడంతో.. రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా, లేనిపోని నిబంధనలు పెట్టి జిల్లా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

రవాణా భారం..

ప్రైవేట్ ఫ్యాక్టరీ ఎలాంటి సబ్సిడీలు ఇవ్వకపోయినా.. చెరుకు పంటపై ఆసక్తితో చెరుకును సాగు చేసిన రైతులకు రవాణా భారం పెద్ద సమస్యగా మారింది. జిల్లా నుంచి కామారెడ్డి చక్కెర ఫ్యాక్టరీ కనీసం 150 కి.మీ. వరకు ఉంటుంది. గతంలో ముత్యంపేట ఫ్యాక్టరీ వారు 15 కి.మీ. వ్యాసార్థంలో రవాణా భారం వేసేవారు కాదు. 15 కి.మీ. తర్వాత ఉన్న రైతులు ఎంతో కొంత మొత్తం చెల్లించేవారు. ఇప్పుడు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెరుకు సాగు చేసేవారు కామారెడ్డికి లారీల్లో చెరుకు తరలించడం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం రైతులు చెరుకును కామారెడ్డి ప్రైవేట్ ఫ్యాక్టరీకి తరలించేందుకు టన్నుకు దాదాపు రూ.700 వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇలా దాదాపు జిల్లా చెరుకు రైతులు రవాణా పేరిట రూ.4.50కోట్ల వరకు నష్టపోతున్నారు.

దిగుబడులు ఘనం.. వచ్చేది స్వల్పం

ఇక్కడి చెరుకు రైతులు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించడంతో ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. ప్రస్తుతం చెరుకు టన్ను ధర రూ.3,470 వరకు ఉండగా, అందులో చెరుకు కటింగ్ కోసం కూలీలకు టన్నుకు రూ.860, రవాణా కోసం టన్నుకు రూ.700 వరకు ఖర్చు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. పంటకు అవసరమైన రసాయన ఎరువులు, కలుపు వంటి వాటి కోసం మరింత ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఇతర ప్రాంతాలకు చెరుకు తరలించడం వల్ల రైతులకు పెద్దగా మిగిలింది ఏమీ లేదు.

ప్రభుత్వం భరించాలి



చెరుకు రైతులపై పడే రవాణా భారాన్ని ప్రభుత్వం భరించాలి. చెరుకు పండిస్తే మాకు ఆదాయం కాకుండా ఖర్చులు మిగులుతున్నాయి. త్వరగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించి చెరుకు రైతులకు అండగా ఉండాలి. – మామిడి మహేందర్‌రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి

మమకారం చంపుకోలేకే..



చెరుకు పంటపై మమకారం చంపుకోలేక సాగు చేస్తున్నాం. ఇక్కడ ఫ్యాక్టరీ ప్రారంభం కాకపోవడంతో కామారెడ్డికి తరలించాల్సి వస్తోంది. రవాణా భారం, కటింగ్ వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాం. – పీసు రాజేందర్‌రెడ్డి, మూడుబొమ్మల మేడిపల్లి, మెట్‌పల్లి